ప్రజాశక్తి

బుధవారం 23 నవంబర్ 2022 5

పార్వతీపురం మన్యం

ఎంఇఒ పై విచారణ

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి.జోగారావుపై వచ్చిన ఆరోపణలపై డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా స్థానిక కెజిబివి పాఠశాల వద్ద కొంతమంది మహిళా ఉపాధ్యాయులను విచారించారు. అలాగే మరి కొంతమంది మహిళా ఉపాధ్యాయులను స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద విచారణ చేపట్టారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎంఇఒ జోగారావు సెలవు మంజూరుపై మహిళా ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారని, వారిని పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని, తొలివిడత నాడు-నేడు పనుల్లో డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, డిఇఒ ఆదేశాల మేరకు ఎంఇఒపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

రూ.1123కోట్లతో ఇంటింటికీ తాగునీరు

- గోనె సంచులు, ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి
- ఉపాధి హామీ ద్వారా పూడికతీత
- సామూహిక గృహప్రవేశాలకు ముందే విద్యుత్ సదుపాయం
- వేపాడ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం
- జెడ్‌పి సమావేశంలో పలు సమస్యలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ; వేదికపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో రూ.1123కోట్లతో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. గోనె సంచులు, ధాన్యం ట్రాన్స్‌పోర్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ఉపాధి నిధులతో సాగునీటి కాలువల్లో పూడిక తీసే పనుల ప్రతిపాదనలు, ముందుగా ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని మంత్రి సూచించారు. సామూహిక గృహప్రవేశాల నాటికి ముందే ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. శాఖపరమైన పనులు ఎన్ని చేసినా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కార బాధ్యత సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లదేనని స్పష్టం చేశారు.

చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణం, విద్యుత్, గ్రామీణ ఉపాధిహామీ, వైద్యారోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ముందుగా జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.1123 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,15,337 ఇళ్లకు సురక్షిత తాగునీటిని అందించే కృషి జరుగుతోందన్నారు. మంత్రి బొత్స మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని అంకితభావంతో త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని ఇళ్లకు కూడా కుళాయిలు వేస్తామని తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ఈఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు మంత్రి బొత్స, జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు చెప్పారు. దళారులు, మిల్లర్ల ప్రమేయాన్ని పూర్తిగా నిరోధించే చర్యలను తీసుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో గోనె సంచులకు కొరత, ట్రాన్స్‌పోర్టు సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని, దీన్ని అధిగమించేందుకు సమగ్రమైన ప్రణాళికతో ముందుకు సాగాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్నఅప్పలనాయుడు సహా పలువురు సభ్యులు కోరారు. జిల్లాలో డిసెంబరు 21న సామూహిక గృహప్రవేశాలు జరుగుతాయని, ఈలోపే ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించే బాధ్యత ఎపిఇపిడిసిఎల్ అధికారులు చూసేకోవాలని మంత్రి బొత్స ఆదేశించారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు స్థానికంగా ఉండడం లేదని, సకాలంలో స్పందించక పోవడం వల్ల విద్యుత్ అంతరాయం తప్పడం లేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఎనర్జీ అసిసెంట్లు జాబ్‌చార్టుకు అనుగుణంగా పని చేయాల్సిందేనని, అలా పని చేయని వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటారని అన్నారు. ఉపాధిహామీ ద్వారా సాగునీటి కాలువల్లో పూడిక తీతకు ప్రతిపాదనలు రూపొందించామని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి వివరించారు. దీనిపై మంత్రి బొత్స స్పందిస్తూ పూడికతీత ప్రతిపాదలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాలని, అనంతరం వారి సూచనల మేరకు చేర్పులు, మార్పులు చేసి పనులు మొదలుపెట్టాలని సూచించారు. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ పనిభారాన్ని తగ్గించేందుకు, టెక్నికల్ అసిస్టెంట్లను రేషనలైజ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధులనుంచే జీతాలను చెల్లించాలని మంత్రి స్పష్టం చేశారు. పార్వతీపురంలో కేంద్ర గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడానికి తగిన స్థలాన్ని చూడాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్సీలు డాక్టర్ పి.సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పాకలపాటి రఘువర్మ, కురుపాం, గజపతినగరం, ఎస్‌కోట, పార్వతీపురం, బొబ్బిలి ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, అప్పలనర్సయ్య, శ్రీనివాసరావు, జోగారావు, శంబంగి చినప్పలనాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, జెడ్‌పి డిప్యూటీ ఛైర్మన్లు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వేపాడకు బస్సు సౌకర్యం

వేపాడ మండల కేంద్రానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్న సభ్యుల విజ్ఞప్తి మేరకు మంత్రి వెంటనే స్పందించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సుందరపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

సుందరపేట సిహెచ్‌సిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని భోగాపురం జెడ్‌పిటిసి పడాల మంజులత కోరారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా అవసరమని అన్నారు. దీనికి మంత్రి బొత్స స్పందిస్తూ తక్షణకే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామని తెలిపారు. కొత్తవలస పిహెచ్‌సి స్టాఫ్ నర్స్ విధులకు గైర్హాజరైన విషయంపై సభలో చర్చ జరిగింది. విచారణ చేసి, ఆమెను సస్పెండ్ చేయాలని మంత్రి బొత్స ఆదేశించారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

డిఎ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిఎఫ్. ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉపాధ్యాయుల జిఐఎస్, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ తదితర ఆర్థిక సంబంధమైన బకాయిలు సుదీర్ఘ కాలంగా పేరుకుపోయాయని, వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, రాష్ట్ర మహిళా విభాగం నాయకులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జె.రమేష్‌చంద్ర పట్నాయిక్ మాట్లాడారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా మార్చి 2022 నాటికి అన్ని బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఎలాంటి పురోగతీ లేదన్నారు. ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1826 కోట్లు పైబడి పేరుకు పోయాయని అన్నారు. పిఎఫ్ బకాయిలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉండగా మిగిలిన అన్ని రకాల బకాయిలు ఏడాదికి పైగా ఉన్నాయని తెలిపారు. వివాహాలు, ఆసుపత్రుల ఖర్చుల వంటి అత్యవసర సందర్భాలకు పిఎఫ్. ఎపిజిఎల్ఐ లోన్లు వంటి వాటికి దరఖాస్తు చేసుకొన్న వారికి సకాలంలో ఆ మొత్తాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ ఎరియర్లకు ఇన్‌కం టాక్స్ చెల్లించినప్పటికి ఇప్పటివరకు వారికి ఖాతాలలో జమ కాలేదని చెప్పారు. సరెండర్ లీవులు, ఇతర ఆర్థిక పపరమైన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరిట ప్రతీ నెలా ప్రజలకు వేలాది కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం, ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమే అన్న సంగతి మరచిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు. చెల్లించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖ ఎడికు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యుటిఎఫ్ ఉమ్మడి జిల్లాల నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి-పాలకొండ

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆనంద్

జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్థానిక నగర పంచాయతీలోని సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంత వరకు ఎన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి, ప్రారంభం కానివి ఎన్ని ఉన్నాయన్న వివరాలపై సమీక్షించారు. వెంటనే ప్రారంభం కాని గృహాలను ప్రారంభించేలా చూడాలన్నారు. సచివాలయాల వారీగా లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అలాగే వివిధ స్థాయిల్లో ఉన్న ఇళ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ బి.నవ్య, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

ఉమా కవికి కాళోజీ సేవా పురస్కారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళానికి చెందిన సాహిత్య చైతన్య కిరణాలు, బాలకథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు ఉమాకవికి కాళోజీ పురస్కారం ప్రకటించినట్లు వల్లూరి ఫౌండేషన్ అధ్యక్షులు వల్లూరి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జిసిఎస్. వల్లూరి ఫౌండేషన్ వారు మంగళవారం తెలంగాణ సాహిత్య పురుషుడు, సాహితీవేత్తలకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉమాకవికి అభినందనలు తెలిపారు.

మాంసం దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక పెదమార్కెట్‌లో మంగళవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ ఆధ్వర్యాన సిబ్బంది మాంసం, చేపల దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యత లేని, నిల్వ ఉన్న కోడి, గొర్రె మాంసం విక్రయాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన గొర్రె మాంసం విక్రయించే దుకాణాల నుంచి 30కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

సీతంపేట : సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు సచివాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంఎవై గృహాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డు బ్యాంకు లింకేజీ చేయాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు అభివృద్ధి చేయాలన్నారు.జల జీవన మిషన్ గురించి అవగాహన కల్పించాలన్నారు.

మేకను చంపేసిన పులి

మన్యం జిల్లాలో సంచారం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పొట్టిగదబవలస సమీపాన జంతికొండ ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని పెద్దపులి సంచారం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. సోమవారం సాయంత్రం బుచ్చింపేటకు చెందిన బలసు శంకరరావు మేకలను ఓ తోటలోని మేపుతుండగా పులి దాడి చేసింది. ఇందులో ఒక మేకను చంపేసింది. అయితే దూరంగా ఉన్న కాపరి దీన్ని గమనించకుండా మేకలు చల్లాచెదురు కావడంతో వాటిని తోలుకొని ఇంటికి వెళ్ళాడు. అనంతరం మేకల మందలో ఒక మేక లేకపోవడంతో వెతికాడు. మంగళవారం ఉదయం డోపసీల సమీపంలో మేకను పులి తినేసి విడిచిపెట్టిన కళేభారాన్ని గుర్తించాడు. దీంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి నారాయణరావుకు సమాచారం ఇవ్వడంతో పులి దాడి చేసినట్లు గుర్తించారు. పులి పాదముద్రల గుర్తించి జంతికొండ వైపు పులి కదలికలు ఉన్నట్లు అంచనా వేశారు. దీంతో స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.

మేక కళేబారాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పార్వతీపురంలో ప్రవేశించిన పులి

పార్వతీపురంరూరల్ : గత కొద్దిరోజులుగా విజయనగరం జిల్లాలో సంచరిస్తున్న పులి, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించింది. ఏనుగులతో సతమతమౌతున్న ప్రజలకు ఇప్పుడు పులి కూడా తోడవ్వడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. డోకిశీల పంచాయతీ జంతికొండ అంచునే ఉంటున్న బుచ్చింపేటకు చెందిన బలసు శంకరరావుకు చెందిన మేకను పులి చంపేసింది. సచివాలయ సిబ్బంది సమాచారంతో మక్కువ అటవీశాఖ అధికారులు వచ్చి పులి అడుగుజాడలను నిర్ధారణ చేసుకున్నారు.

24న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి కలెక్టరేట్

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 2022-23 యువజనోత్సవాలు ఈ నెల 24న స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజి నిర్వహించనున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామానందం తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాలలో సాంస్కృతిక పోటీలు, 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జానపద నృత్యాలు, గీతాలు, ఏక పాత్రాభినయనం, సాంప్రదాయగాత్రం, క్లాసికల్ వాయిద్యాలు, గిటార్, సాంప్రదాయ నృత్యం, వక్తృత్వపోటీలు, గీతం, నీత్యం, మిమిక్రీ, చిత్రలేఖనం, క్విజ్, శిల్పకళ ఫ్యాన్సీ డ్రెస్, కళాకారులు, సాహసకృత్యాలు తదితర పోటీల అంశాల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆశక్తి గల యువత పూర్తి చేసిన దరఖాస్తులను యువజన సంక్షేమాధికారి/సి.ఇ.ఒ., సెట్విజ్, పార్వతీపురం మన్యం వారికి ఈనెల 23లోగా వాట్సాప్ నెంబరు 8247554334కు లేదా setviz@yahoo.comకు పంపాలన్నారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ, అక్కడ గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరములకు కార్యాలయపు పని వేళలలో ఫోన్: 8247554334ను సంప్రదించవలెను. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరోల విజయవాడలోనూ, జాతీయ స్థాయి పోటీలు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరిలోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెదమరికిలో పెద్దఎత్తున నిధుల దుర్వినియోగం

- సర్పంచి, కార్యదర్శి చేతివాటం
- కలెక్టర్‌కు, ఎంపిడిఒకు వార్డుసభ్యుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదమరికి పంచాయితీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్పంచ్ హిమరిక గంగ, కార్యదర్శి చంద్రశేఖర్ కలిసి పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులుతో పాటు, 2021-22 2022-23 ఆర్థిక సంవత్సరానికి చెందిన సాధారణ నిధులు, 14,15 ఆర్థిక సంఘం నిధులు, ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీల నిధులు, వెనుకబడిన ప్రాంత గ్రాంటు, తదితర నిధులు దాదాపు రూ.40లక్షలకు నిబంధనలకు డ్రాచేసుకుని తమ సొంతానికి వాడుకున్నట్లు ఆ పంచాయతీ వార్డుమెంబర్లే ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలోనూ, ఎంపిడిఒ అకిబ్‌జావేద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పంచాయతీకి చెందిన రెండుగ్రూపులు ఏకమై ఉమ్మడి అభిప్రాయంతో సర్పంచ్ హిమరిక గంగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత సర్పంచ్ భర్త రాజు పంచాయతీ వ్యవహారలలో జోక్యం చేసుకోవడం మొదలు పెట్టారు. దీంతో ఇరువర్గాలు అతనిపై అలిగి పంచాయితీ విషయాలను పట్టించుకోవడం మానేశారు. ఇదే అదును చేసుకొని వారు ఏకంగా పంచాయితీ సమావేశాలే పెట్టడం మానేశారు. పాలక వర్గం ఏర్పాటై 30నెలలో కేవలం రెండుసార్లు మాత్రమే సమావేశం నిర్వహించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రతి మూడునెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశాలను సైత నిర్వహించకుండా, మినిట్స్ పుస్తకం తీర్మానాలు తనకు నచ్చిన విధంగా రాసుకుంటూ, కార్యదర్శి చంద్రశేఖర్ పనులపై పంచాయితీ కార్యాలయానికి వచ్చిన వార్డుమెంబర్ల నిరక్షరాస్యత, అమాయకత్వాని అసరాగా తీసుకుని, మాయమాటలతో వారి నుంచి సంతకాలను తీసుకోవడం అలవాటుగా మార్చుకుని విచ్చల విడిగా నిధులు విత్‌డ్రా చేసుకున్నారని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. విత్‌డ్రా చేసుకున్న నిధుల్లో 60-40 వంతున పంచుకొనే వారని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామపెద్దలు వారిని నిలదీసినప్పుడు వారు చెప్పిన సమాధానాలు పొంత లేకపోవడంతో నిధులు దుర్వినియోగమైనట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సర్పంచిని, కార్యదర్శిని అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వార్డు మెంబర్లంతా ఏకమై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయితీ రాజ్ అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవతీసుకుని వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, ఒక వేళ నిధులు దుర్వినియోగమైతే రికవరీ చేసి పంచాయితీ ఖాతాల్లో జమచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సర్పంచ్‌పై ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న ఉపసర్పంచ్, వార్డుసభ్యులు (ఫైల్)

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

పెదమరికి పంచాయితీలో అవినీతి, నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదు అందింది. ఆరోపణలపై విచారణ జరిపిస్తాం. ఈ ఆరోపణలు వాస్తవమైతే చట్టప్రకారం చర్యలు చేపట్టి, నిధులను వెనక్కు తీసుకొచ్చేలా చర్యలు చేపడతాం.

అకిబ్‌జావేద్,
ఎంపిడిఒ, పార్వతీపురం.

అందని మెస్ ఛార్జీలు... పెరగని డైట్ బిల్లులు

- భారంగా మారిన హాస్టళ్ల నిర్వహణ
- గగ్గోలు పెడుతున్న వసతి గృహ సంక్షేమాధికారులు

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులకు వరుసగా నాలుగు నెలలుగా డైట్ బిల్లులు అందకపోవడంతో వసతి గృహ సంక్షేమాధికారులకు, డిప్యూటీ వార్డెన్లకు హాస్టళ్ల నిర్వహణ భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దొరికన ప్రతి చోటా అప్పులు చేస్తూ హాస్టళ్లను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇంకా అప్పులు పుట్టకపోవడంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో నెట్టుకొస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, కెజిబివి, ఏకలవ్య పాఠశాలు, మినీ గురుకులాల్లో సుమారు 20వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, రెండు రోజులు చికెన్, ఆరు రోజులు పాలు, ఆరు రోజులు గుడ్లు పెట్టాలి. అయితే 8, 9, 10 తరగతి విద్యార్థులకు రోజుకు రూ.40 చొప్పున డైట్ ఛార్జీలను ప్రభుత్వం కేటాయించింది. పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.45 చొప్పున కేటాయించింది. అయితే 2018 నుంచి ఇదే ఛార్జీలు ఇవ్వడంతో ప్రస్తుతం పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోవడంలేదు. డైట్ బిల్లులు పెంచకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. 2018లో ఇదే 40 రూపాయలకు గ్యాస్ 470 ఉంటే ప్రస్తుతం రూ.1100కి పెరిగింది. అలాగే వంటనూనె కిలో రూ.68 ఉంటే ప్రస్తుతం రూ.135కు, కందిపప్పు రూ.70 నుంచి రూ.90కు, కారంపొడి రూ.160నుంచి రూ.250కు పెరిగింది. దీంతో

పాటు కూరగాయలు, చికెన్ ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. ఇలా పెరుగుతున్న ధరలకు తగ్గట్టు మెస్‌ఛార్జీలు పెంచకపోతే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేదెలా అంటూ తలలు పట్టుకుంటున్నారు. గ్యాస్ కూడా కనీసం అరువు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు జూలై నుంచి అక్టోబర్ వరకు (4నెలల) డైట్ బిల్లులు అందకపోవడంతో వసతిగృహ సంక్షేమాధికారులు, డిప్యూటీ వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. బిల్లుల చెల్లింపు కోసం అధికారులను కోరితే బిల్లులో పంపించామని, ట్రెజరీ ఉన్నాయని చెబుతున్నారని వార్డు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టళ్ల తనిఖీకి వచ్చే సమయంలో భోజనాల నాణ్యత, మెనూ అన్నీ చూస్తున్నారు కానీ మెస్‌ఛార్జీల పెంపు, సకాలంలో బిల్లులు చెల్లింపుపై దృష్టిసారించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు పంపించాం

విద్యార్థుల మెస్‌ఛార్జీలకు సంబంధించిన బిల్లులు ట్రెజరీకి పంపించాం. వారం రోజుల్లో రానున్నాయి. ప్రస్తుతం బడ్జెట్ ఉన్నంత వరకు బిల్లులు వచ్చే అవకాశం ఉంది.

జి.మంగవేణి
ఎటిడబ్ల్యుఒ, సీతంపేట

రికార్డులను పరిశీలిస్తున్న పశు సంవర్థకశాఖ డిడి నీలయ్య

లంపి స్కిన్ నివారణకు టీకాలు : డిడి

పాచిపెంట :పశువులకు సోకుతున్న లంపిస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు పూర్తిచేయాలని పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.నీలయ్య స్థానిక పశు వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని విశ్వనాధపురం, పాచిపెంట పశువైద్యశాలలు, కర్రివలస ఆర్‌బికెను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పశు వైద్యుల వద్ద వివరకాలతో మాట్లాడుతూ లంపిస్కిన్ వైరస్ నివారణకు మండలంలో ఇప్పటికే 10,500 టీకాలు వేశామని, మరో 1500 టీకాలు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. అలాగే పాడి రైతులకు దాణ అవసరం 60 శాతం సబ్సిడీపై 24 టన్నులు అందజేశామని, గడ్డి విత్తనాలు 200 కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎడి పి.సన్యాసినాయుడు, పశు వైద్యాధికారి ఎం.వెంకటరమణ, గంటా రమేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు చేయించుకోవాలి

కురుపాం : లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుండి ఫిబ్రవరి 28లోగా చేయించుకోవాలని సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఆర్.శంకరరావు పెన్షనర్లకు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీవన ప్రమాణ సర్టిఫికెట్లను పెన్షనర్లు ఎప్పుడు పడితే అప్పుడు చేయిస్తున్నారని, అవి చెల్లవని, కావున ప్రతి పెన్షనర్ ఇది గమనించి ప్రభుత్వం నిర్దేశించిన తేదీల్లోనే చేయించాలని సూచించారు. ఆరోగ్యం బాగోలేక బెడ్ రెస్ట్ ఉన్నవారి వద్దకు మాత్రమే ట్రెజరీ నుంచి తాము వెళ్లి చేయిస్తామని అన్నారు.

రూ.20లక్షలతో అభివృద్ధి పనులకు తీర్మానం

జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డి పంచాయతీకి గడపగడపకు మన ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20లక్షలు నిధులు వివిధ పనులకు పంచాయతీ తీర్మానం చేసింది. పంచాయతీ సమావేశం మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం కార్యాలయంలో నిర్వహించారు. ఈ నిధులు ఏఏ పనులకు ప్రతిపాదించాలని సభ్యులు చర్చించారు. గ్రామంలో ఈ నిధులతో సిసి రహదారులు, కాలువలు నిర్మించుకోవాలని తీర్మానించారు. మధుర గ్రామం గదబవలసతో ఏడు పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. బిసి కాలనీలో కాలువలు, ఎస్సీ కాలనీలో సచివాలయానికి వెళ్లే రహదారి, గదబవలసలో కాలువ పనులు చేపట్టాలని సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఈ సమావేశంలో సర్పంచ్ సీమల సుజాత, ఎంపీటీసీ రేవల్ల జ్యోతి, వైస్ సర్పంచ్ రేవల్ల తిరుపతిరావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలమైన భవనాలపై దృష్టి పెట్టాలి

వీరఘట్టం : శిథిలమైన పాఠశాలల భవనాలపై దృష్టి పెట్టాలని జనసేన నియోజకవర్గం బాధ్యులు గర్భాన సత్తిబాబు ఆరోపించారు. మంగళవారం జనసేన పల్లెబాట పర్యటనలో భాగంగా మండలంలోని పాపంపేట ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి నివ్వెరపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తుంది తప్ప ఆ దశగా చర్యలు చేపట్టకపోవడంతో శిథిలమైన పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ప్రమాదం ఉన్నప్పటికీ నిర్వహణ కొనసాగిస్తున్నారని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దీనికి బాధ్యులు ఎవరని ఆయన ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సొంత పంచాయతీలోని ఇలా ఉన్నదంటే నియోజకవర్గంలోనే ఇంకెంత ఘోరంగా ఉంటుందో వేరేగా చెప్పనవసరలేదని అన్నారు. తక్షణమే కొత్త భవనాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జనసేన నాయకులు కూరంగి నాగేశ్వరరావు, వెంకటరమణ, సోంబాబు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ చిన్నకృష్ణ

ధాన్యం నాణ్యతపై అవగాహన

బలిజిపేట :రైతు భరోసా కేంద్రాలకు తరలించే ధాన్యంలో తేమశాతం, నాణ్యతపై జిల్లా పౌరసరఫరాల శాఖ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ చిన్న కృష్ణ వివిఎలకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆయన గ్రామ వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఎఫ్ఎక్యూ ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసే అధికారులు తేమ, వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు, పెళ్లలు, చెత్తా చెదారులు, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్నధాన్యం, గ్రేడ్-ఎ రకం కొనుగోలులో తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు కేళీలు, పరిపక్వం కానీ, ముడుచుకుపోయిన, ఒంకర తిరిగిన ధాన్యాన్ని పరిశీలించాలన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివిఎస్ శర్మ, సిఎస్‌డిటి రమేష్, వ్యవసాయ శాఖ ఎఒ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కురుపాం : ఓటర్లకు ఆధార్ అనుసంధానం చేయాల్సిన బాధ్యత బిఎల్ఒలదేనని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయం వద్ద బిఎల్ఒలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6-బి ఫారం, పోలింగ్ స్టేషన్ పరిధిలో గల ఆడ, మగ, థర్డ్ జెండర్ సంఖ్యను గుర్తించాలని, అలాగే 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు పంచాయతీ స్థాయిలో ఓటు హక్కును చేర్పించడానికి ముఖ్య పాత్ర తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండలంలో గల బిఎల్ఒలు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాధులు

పింఛను లబ్ధిదారుల ఎంపికపై పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలోని ఎం.సింగుపురం, మల్లివీడు, బిఎల్ వలస, జంపర కోట ప్రాంతాల్లో జరుగుతున్న వికలాంగుల పింఛన్ల సర్వేను ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం పరిశీలించారు. సర్వే ఏ విధంగా చేస్తున్నారు. అర్హులను ఎలా గుర్తిస్తున్నారు అన్న అంశాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పారదర్శకతతో సర్వే చేపట్టాలని, అర్హులు సర్వేలో తప్పిపోకుండా చూడాలని అన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం

సీతానగరం : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఫిజియోథెరపీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జి.సూర్యదేముడు మాట్లాడుతూ ఈ పిల్లల కోసం ప్రభుత్వం ఫిజియోథెరపిస్టు వైద్యులు ఏర్పాటు చేసిందని వీరికి ప్రతి వారం ఇక్కడే వైద్య అధికారులు వచ్చి ఫిజియోథెరపీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి 11 మంది పిల్లలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ జి.వినయ్‌కుమార్, పి.కృష్ణమోహన్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు వినయ్‌కుమార్

చదువులోనూ రాణించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పిఒ బి.నవ్య అభినందించారు. ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సందర్భంగా పిఒ మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో సీతంపేట ఐటిడిఎకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టినందుకు అభినందించారు. అలాగే క్రీడల విభాగంలో బాలుర గేమ్స్ చాంపియన్ షిప్, బాలికల గేమ్స్ ఛాంపియన్ షిప్, బాలికల స్పోర్ట్స్ చాంపియన్ షిప్, ఓవరాల్ గేమ్స్, స్పోర్ట్స్ చాంపియన్ షిప్ గెలవడం గొప్ప విషయమని కొనియాడారు. సాంస్కృతిక పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. క్రీడల వల్ల చదువును నిర్లక్ష్యం చేయకూడదని, చదువులో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, పిడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

24న క్రీడాకారుల అభినందన సభ

కలెక్టరేట్ :జన జాతీయ గౌరవ దినం సందర్భంగా విశాఖలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా, సాంస్కృతిక ఉత్సవాల్లో స్థానిక ఐటిడిఎకు చెందిన క్రీడాకారులు, కళాకారులు, వివిధ క్రీడాంశాల్లో వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, రన్నర్స్‌గా అథ్లెటిక్ విభాగంలో బి.చాందిని, లంకజోడు పాఠశాలకు చెందిన బాలిక వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించింది. సాంస్కృతిక విభాగం నుంచి పెదబొడ్డేడ, కోసంగిభద్రకు చెందిన బాలురు బహుమతులు సాధించారు. వీరికి ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్ చేతుల మీదుగా ఈనెల 24న గురువారం ఉదయం 9.30గంటలకు అభినందన సభ ఏర్పాటు చేయనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయమని గిరిజన సంక్షేమ డిడి బి.సూర్యనారాయణను, జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వాసుదేవరావు నాయుడును ఆదేశించారు.

విజేతలైన క్రీడాకారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

24న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 24న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ బ్రాంచి మేనేజర్ కె.జగజ్యోతి తెలిపారు. పట్టణంలోని శివాలయం వీధిలో గల సీతారామ ధర్మశాలలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు హాజరు కావాలని ఒక ప్రకటనలో ఆమె కోరారు.

కొనసాగుతున్న కుష్టువ్యాధి సర్వే

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కుష్టువ్యాధి గుర్తింపుపై మండలంలోని నర్సిపురంలో బందలుప్పి వైద్యసిబ్బందితో పాటుగా స్థానిక సబ్‌సెంటర్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. గ్రామస్తులను కలుసుకొని ఈ వ్యాధి లక్షణాలు వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్.రాజేశ్వరి, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థి దశలో పిల్లల నడవడికపై తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరమని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.సాయిశ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం ఆ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో పిల్లల నడవడిక-తల్లిదండ్రుల బాధ్యత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలపై అఘాయిత్యాలు, ఘోరాలు పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని అన్నారు. ఒకప్పుడు సమిష్టి కుటుంబాలున్న పరిస్థితుల్లో పిల్లల నడవడికపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. గతంలో పాఠశాలలో పిల్లల బాగు కోసం నడవడిక బాగా లేనప్పుడు ఉపాధ్యాయులు వారిని శిక్షించే అవకాశం ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితే లేదని, దీనికి కారణం తల్లిదండ్రులేనని చెప్పారు. పిల్లల ప్రవర్తన మాటతీరులపై తల్లిదండ్రులు విధిగా దృష్టి సారించాలని సాయి శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ పాల్గొన్నారు.

1నుంచి 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

డిసెంబర్ 1 నుంచి జరగబోవు ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని కురుపాం నియోజకవర్గ పరిధిలో గల అన్ని పంచాయతీల్లో ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయాలని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి కోరారు. మంగళవారం చినమేరంగిలో మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు స్వగృహం ఆవరణలో కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగదీశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల కోసం ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం తెలుగుదేశం చేపడుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో గల ఐదు మండలాల్లో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం జరిగిందని ఆమె తెలిపారు. ఆ సమావేశంలో చర్చించిన అంశాలను సమన్వయ కమిటీ సభ్యులకు ఆమె తెలియజేశారు. సమావేశంలో కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : డిశంబర్ 1 నుంచి పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే వినూత్న కార్యక్రమం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి

సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

చిరంజీవులుతో కలిసి సంబంధిత కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టుపట్టించడమే కాకుండా అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర ప్రజలు అనుకుంటున్న ఇదేం ఖర్మ నినాదంతో ప్రజాక్షేత్రంలో అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడతామని అన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గమోహన్,జిరవికుమార్, నాయకులు కొల్లి తిరుపతిరావు, కోలాబాబు, బోనుచంద్రమౌళి, ఉదయభాను, జాగానరవికుమార్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

24న రైతులకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి - పాచిపెంట

అర్హత ఉండీ రైతు భరోసా పొందని, చనిపోయి నామిని వివరాలు ఇవ్వని ఆర్ఒఎఫ్ఆర్ గిరిజన రైతుల కోసం ఈనెల 24న స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టా, ఆధార్ కార్డు ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలతో గ్రీవెన్స్‌కు రావాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలాఖరున ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేస్తుందని, అర్హత ఉండీ రైతు భరోసా పొందని రైతుల కోసం మరోసారి ఈ అవకాశం ఇచ్చిందని కావున వివిఎలు అందరూ ఆర్‌వైఎఫ్ఆర్, గిరిజన రైతులను పూర్తి వివరాలతో తీసుకుని వస్తే రెవెన్యూ శాఖ సహకారంతో గిరి పోర్టల్‌లో సంబంధిత వివరాలను నేరుగా నమోదు చేయించవచ్చని తెలిపారు. చనిపోయిన రైతుల నామినీలను కూడా నమోదు చేయించవచ్చని, తద్వారా వారంతా రైతు భరోసాకు అర్హత పొందుతారని తెలిపారు. అలాగే ప్రతిరోజు వరి కోతలు, నూర్పులకు సంబంధించిన వివరాలను మధ్యాహ్నం రెండు గంటల్లోగా వ్యవసాయ కార్యాలయానికి అందించాలని సూచించారు. రబీ సీజన్‌కు కావాల్సిన ఎరువులను సిద్ధం చేయాలన్నారు. రైతులకు ఖరీఫ్‌కు సంబంధించిన

సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

ఈక్రాప్ వివరాల రసీదులను అందించాలని, రాబోయే మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల నాణ్యత ప్రమాణాల గురించి రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి తెలియజేయాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న సమచార బోర్డులపై విషయాలను పొందుపర్చాలని తెలిపారు. అంతేకాక పొగాకులో పొటాష్ ఎరువుకు ప్రత్యామ్నాయంగా జిల్లేడు కషాయాన్ని, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మెటరైజం జీవ నియంత్రణ కారకాన్ని వాడాలన్నారు. జీడి తోటల్లో సహజ సేంద్రియ పద్ధతుల ద్వారా టీ దోమ నివారణను కోసం రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

పసుకుడిలో గడపగడపకు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని పసుకుడి, కొత్తపసుకుడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రశ్నించారు. ఒక కుటుంబం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏనేటి కొండ సామాజికవర్గానికి చెందిన వారికి గతంలో ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారిని, 2009 తర్వాత కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదు అని అన్నారు. ఇతర కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల కొన్ని సంక్షేమ పథకాలు కోల్పోవాల్సి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పసుకుడికి చెందిన గొర్ల సాయి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, చికిత్సకు అవకాశం లేదని వైద్యులు తెలిపారని, పింఛను మంజూరయ్యేలా చూడాలని సాయి తండ్రి రాజు ఎమ్మెల్యేకు తెలిపారు. అల్లు విజయశాంతి 52 సెంట్లు భూమికి సంబంధించి నష్టపరిహారం రాలేదని తెలిపారు. సంబంధిత అధికారులకు తెలియజేసి, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మండలం ప్రజాప్రతినిధులు ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉండి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, కన్వీనర్ తోట సింహాచలం, టింగ అన్నాజీరావు, కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్ బెవర భార్గవనాయుడు, పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

'కొత్త ఇళ్ల నిర్మాణాలకు మార్గం సుగమం'

ప్రజాశక్తి - భామిని

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా త్వరితగతిన గృహ నిర్మాణాలకు మార్గం సుగమమైందని ఎమ్మెల్యే వి.కళావతి తెలిపారు. మంగళవారం పసుకుడిలో విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలానికి మంజూరైన ఇళ్ల నిర్మాణానికి సొంత స్థలం ఉంటే పొజిషన్ సర్టిఫికెట్లు త్వరితగతిన అందజేయాలని తహశీల్దార్ అప్పారావును ఎంఎల్ఎ సూచించారు. ఇళ్లు మంజూరైన వారు స్థలం లేకపోతే ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇల్లు, స్థలం రెండూ లేనివారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరవుతాయని తెలిపారు. పిఎం అవాస్ యోజన ద్వారా మంజూరైన ఇళ్లకు రూ.లక్షా80వేలు అందజేస్తుందని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ సూడా ద్వారా ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ అంశాన్ని రెవెన్యూ, సచివాలయం ప్రజాప్రతినిధులు ప్రతి పంచాయతీలోని గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి, అర్హత కలిగిన వారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేలా చేయాలని సూచించారు. ఇల్లు మంజూరై నిర్మాణం జరిగినా పెండింగ్ బిల్లులు కూడా చెల్లింపు జరుగుతుందని చెప్పారు. గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఆర్ఒఎఫ్ఆర్ స్థలాలు కలిగి, ఆ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుంటామంటే, ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణం అనుమతికి ప్రతిపాదనలు పంపాలని, లేకుంటే మైదాన ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుంటామంటే ప్రభుత్వం స్థలం కేటాయించి, పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తహశీల్దార్‌కు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, సర్పంచ్ బెవర భార్గవనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

నిరుద్యోగ గిరిజన యువకుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని షెడ్యూల్డు ఏరియాలో గల గ్రామాల యువకులకు షెడ్యూల్ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గిరిజన సంఘాల ఆధ్వర్యాన యువకులు ధర్నా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజన సంఘాలు ఆందోళనకు దిగాయి. గతంలో రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన ఏజెన్సీ ధ్రువపత్రాలు చెల్లబోవని, షెడ్యూల్ ధ్రువపత్రాలు ఉన్న వారికే ఉద్యోగాలు లభించాయని గిరిజన సంఘాల నాయకులు చెప్పారు. దీనిపై హైకోర్టు లో కేసు వేయగా మధ్యంతర ఉత్తర్వులు కోర్టు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు ధ్రువపత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన యువకులు ధర్నా చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన నిరుద్యోగ యువత

షెడ్యూల్ ఏరియా ధ్రువపత్రాలు మంజూరు చేయించే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు.

కాంప్లెక్స్ మెరుగుకు చర్యలు : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆర్‌టిసి ప్రయాణీకుల సౌకర్యార్థం కోసం స్థానిక కాంప్లెక్స్‌ను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకున్నామని పార్వతీపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ దుర్గ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. గత కొన్ని రోజుల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న పలు సమస్యలను దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపు గదులను మరమ్మతులు చేసి, రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించామని చెప్పారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను వేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు కోరిక మేరకు ఆర్టీసీ బస్టాండ్‌ను దాదాపు అన్ని విధాలా అభివృద్ధి చేశామని అన్నారు. కాంప్లెక్స్‌లో మంచినీటి

ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో గల మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డిఎం దుర్గ

సౌకర్యాన్ని కూడా కల్పించామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి సుమారు రూ.2లక్షల 90వేలు నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ప్రయాణికులు ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీగోడ, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఆమె వెంట పార్వతీపురం ఆర్టీసీ డిపో అకౌంటెంట్ సింహాచలం ఉన్నారు.

రవికుమార్ కు అభినందనలు

ప్రజాశక్తి - సీతంపేట

తన హోటల్‌లో మరిచిపోయిన బంగారాన్ని పోలీసులకు అప్పగించి మన్ననలు అందుకున్నారు స్థానిక మన్యం సప్ హోటల్ యజమాని రవికుమార్, జియ్యమ్మవలస గ్రామానికి చెందిన గర్భాన సంధ్య ఇటీవల సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు మంగళవారం వచ్చారు. పార్క్ సందర్శన అనంతరం ఆమె మన్యం సప్ హోటల్లో భోజనం చేసి నాలుగు తులాల బంగారహారం విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఇది వెంటనే హోటల్ యజమాని రవికుమార్ హారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. వెంటనే బాధితురాలికి పోలీసులు అప్పగించారు. ఈ మేరకు రవికుమార్‌ను స్థానిక ఎస్సై నీలకంఠారావు పోలీస్ సిబ్బంది అభినందించారు.

బాధితురాలికి హారాన్ని అందజేస్తున్న ఎస్ఐ, పక్కన రవికుమార్

మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు

E.P. 1/2020 OS 36/2017

బిట్వీన్ :

సారిక చంద్రశేఖర్ ....డిక్రీ హోల్డరు.

ఎండ్

దాసరి గోవింద నాయుడు డైడ్ వగైరాలు

......జడ్జిమెంట్ డెటార్స్

జేడిఆర్ 4 :- దాసరి జగదీష్, తండ్రి లేటు గోవింద నాయుడు, వయస్సు 23 సం॥లు ఇంటి నెం. 17-42, లూథరన్ హాస్టల్‌కు ఎదురుగా టి.బి. రోడ్డు కొత్తబెలగాం, పార్వతీపురం.

పై డిక్రీ హోల్డరు మీపైన ఇ.పి షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయింపించమని కోరుతూ పై"అమలు" దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్నయెడల **2022వ సంవత్సరం డిసెంబరు నెల 15వ తేదీన ఉదయం గం॥ 10.30 నిముషములకు** ఖుద్దున గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి శ్రీ కోర్టువారితో మనవి చేసుకోవలసినది. లేని ఎడలా సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు

పి. రాజేశ్వరరావు

డిక్రీ హోల్డరు తరపు అడ్వకేటు

పార్వతీపురం.

'కుటుంబ వైద్యుడ్ని' సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గ్రామాల్లో నిర్వహిస్తున్న కుటుంబ వైద్యుడు కార్యక్రమంపై అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని జమదాలలో బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని పర్యవేక్షించిన ఆయన స్థానికులకు కుటుంబ డాక్టర్ విధానంపై డాక్టర్ జగన్మోహన్ అవగాహన కల్పించి, ఆవశ్యకతను వివరించారు. అలాగే అనారోగ్య లక్షణాలకు చెందిన వారికి గల సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి గ్రామంలో క్షేత్ర స్థాయి సందర్శనలను పర్యవేక్షించారు. ముఖ్యంగా కదలలేని స్థితిలో ఉన్న వారి గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేస్తామన్నారు. వారి ఆరోగ్య స్థితి పరిశీలించి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. తదుపరి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధులు మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి భారతి, సూపర్ వైజర్ జయగౌడ్ వైద్య సిబ్బంది, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలి పిహెచ్‌సి పరిధిలో గల నులకజోడు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. గ్రామంలో మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారికి పరీక్ష నిర్వహించి, మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాలింతాలు, కీళ్ళ నొప్పులు, దీర్ఘ కాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటికి వెళ్లి వైద్యం చేశారు. పాఠశాలలో పిల్లలకు పెడుతున్న ఆహారం పరిశీలించారు. కార్యక్రమం వైద్యులు శంకర్, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.